
# నొప్పి డాక్టరు

# తిరుగు ప్రయాణం



హ్యూ లాఫ్టింగ్

# నొప్పి డాక్టరు

# తిరుగు ప్రయాణం

**హ్యూ లాఫ్టింగ్**



## అనుకోని అతిథి

నొప్పి డాక్టరు ఓడలో ఇంటికి తిరిగి ప్రయాణం అయ్యాడు.
"ఇక సాహసాలు అయిపోయాయి," అతను అన్నాడు.
"మనం సర్కస్ మొసలి వాళ్ల అమ్మని కలిశాం. సింహ రాజు కొడుకు జబ్బు నయం చేశాం, సముద్రపు దొంగలను తప్పించుకుని వచ్చేశాం."
అప్పుడే వాళ్లకి టక్ టక్ టక్ అన్న చప్పుడు వినిపించింది.



"ఈ చప్పుడు ఎక్కడ నుంచి వస్తోంది?"
నొప్పి డాక్టరు ఆశ్చర్యపోతూ అడిగాడు.
అందరూ ఓడలో కిందా-పైనా, లోపలా-బయటా వెదికారు.



అందరూ ఆశ్చర్యపోతుండగా ఓడ డెక్కులో ఒక తలుపు తెరుచుకుని ఒక పిల్లవాడి తల బయటకు వచ్చింది.

“ఎవరు నువ్వు?” నొప్పి డాక్టరు అడిగాడు.



“మీరు ఎవరు?” ఆ పిల్లవాడు అడిగాడు.


“ఆ సముద్రపు దొంగలు ఎక్కడ?” అని అతనే మళ్లీ అడిగాడు.

ఆ పిల్లవాడు ఓడ పైకి వచ్చాడు.



“ఈ ఓడలోకి నువ్వు ఎలా వచ్చావు?”
నొప్పి డాక్టరు అడిగాడు.
“సముద్రపు దొంగ అయితే సరదాగా
ఉంటుందని నాకు అనిపించింది,”
పిల్లవాడు చెప్పాడు.






“కానీ సముద్రపు దొంగలు చాలా చెడ్డవాళ్లని
తెలిసింది,” పిల్లవాడు చెప్పాడు.
“అందుకే నేను కింద ఒక గదిలో దాక్కున్నాను.”
“మీ ఊరు ఏది?”
నొప్పి డాక్టరు అడిగాడు.

“నాకు ఊరు పేరు గుర్తు
లేదు,” పిల్లవాడు చెప్పాడు.
“కాని, అది అటు ఉందని నాకు తెలుసు,”
అంటూ వేలితో చూపించాడు.
“కాదు ఇటు అనుకుంటా,”  మళ్ళీ అన్నాడు.


ఏం చెయ్యాలో నొప్పి డాక్టరుకి అర్థం కాలేదు.
ఎటు వెళ్ళాలో తెలియకపోతే పిల్లవాడిని ఇంటికి
ఎలా చేరుస్తాడు?



నొప్పి డాక్టరు కీచుమంటూ ఈల వేసి ఓడ హారస్ రెండుసార్లు మోగించాడు.
అప్పుడు ఒక డాల్ఫిన్ల కుటుంబం ఓడ దగ్గరకు వచ్చింది.



వాటిల్లో అన్నింటికంటే పెద్ద డాల్ఫిన్‌ని నొప్పి డాక్టరు అడిగాడు, “సముద్రంలో ఏం జరుగుతోందో డాల్ఫిన్లకు తెలుస్తుంది. ఈ పిల్లవాడు ఏ దీవి వాడు?”
“మాకు తెలియదు,” ముసలి డాల్ఫిన్ అంది.



## వాసన చూసే కుక్క

నొప్పి డాక్టరు ఓడ మీద అటు, ఇటు పచార్లు చేస్తున్నాడు.

“గుర్తు తెచ్చుకో, అబ్బాయి,” నొప్పి డాక్టరు అన్నాడు. “మీ ఇంటి నుంచి ఏమైనా తెచ్చావా?”

పిల్లవాడు ఒక్క నిమిషం ఆలోచించాడు.

“ఆ, ఇది తెచ్చాను,” అన్నాడు.






అలా అంటూ జేబులోంచి ఒక అప్పచ్చి ముక్క బయటకు తీశాడు.

“మా అమ్మ ఇవి చేసింది, ఇంతే మిగిలింది.”

కుక్క జిప్ దాని వాసన చూసింది.
"భౌ," అంటూ కుక్క మొరిగింది.
"నేను దీని వాసన ఇంతకు ముందు
చూశాను. అటువైపుకి పదండి."

కుక్క తన ముక్కుతో దారి చూపించింది.
"ఈ వాసన అటువైపు నుంచి వస్తోంది."



## తిరిగి వచ్చిన అబ్బాయి

జిప్ చూపించిన వైపుకి నొప్పి డాక్టరు ఓడను పోనిచ్చాడు. ఆ దిశలో ఓడ చాలా దూరం ప్రయాణం చేసింది. ఆ అబ్బాయి వాళ్ల ఇంటికి అసలు చేరుకుంటామా అని అనిపించింది.

"అదిగో!" అంటూ ఆ అబ్బాయి అరిచాడు.

ఆ తరవాత ఓడ మీద నుంచి దూకి ఈదుకుంటూ ఒడ్డుకి చేరుకున్నాడు.



అతని కోసం ఎదురు చూస్తూ వాళ్ల అమ్మ అక్కడ ఉంది.

"నా కోసం కొంచెం ఆగు!" జిప్ మొరిగింది.


"నా కోసం కూడా!" లాగుడు-తోపుడు అంది.

"నా కోసం కూడా!" డబ్-డబ్ బాతు అంది.

"నా కోసం కూడా!" గుబ్-గుబ్ పంది అంది.



“అందరికి వేల, వేల ధన్యవాదాలు,” అమ్మ అంది.
ఆమె కొడుకుని కౌగిలించుకుంది.
“మీ రుణం ఎలా తీర్చుకోను?”
నొప్పి డాక్టరుకి అమ్మ ముద్దు పెట్టింది.






నొప్పి డాక్టరుకి ఏమీ అర్థం కాలేదు.
అతడి ముఖమంతా ఎర్రగా అయిపోయింది.
“నాకు ఆకలిగా ఉంది,” పిల్లవాడు అన్నాడు.
“మాకు కూడా ఆకలిగా ఉంది!” జంతువులన్నీ
అన్నాయి. అమ్మ వంటలు మొదలుపెట్టింది.

అందరూ కడుపు నిండా విందు ఆరగించారు.
“ఈ సంతోష సమయంలో మనం సంబరాలు చేసుకోవాలి,” నొప్పి డాక్టరు అన్నాడు.
“పదండి ఊరేగింపు తీద్దాం,” డబ్-డబ్ బాతు అంది.






“చక్కని ఊరేగింపు నాకు ఆనందాన్ని ఇస్తుంది,” తోపుడు-లాగుడు అంది.
అప్పుడు పిల్లవాడు నిలబడి,
“అందరూ నా వెనకే రండి!” అంటూ అరిచాడు.



ఊరేగింపు ఎంతో సరదాగా ఉంది.
కదం తొక్కుతూ వాళ్లు నడిచారు.
“ఇక మేం వెళ్లాల్సిన సమయం అయ్యింది!”
చివరికి నొప్పి డాక్టరు అన్నాడు.

“ఇన్ని నెలలు మేం ఏమై పోయామోనని మా
అక్క ఆందోళన పడుతూ ఉంటుంది.”
“నీ పరిస్థితిని అర్థం చేసుకోగలను,”
బాధపడుతూనే పిల్లవాడు చెప్పాడు.

ఒకరినొకరు కౌగిలించుకుని
దుఃఖంతోనే వీడ్కోలు పలికారు.
అన్ని జంతువుల తోపాటు నొప్పి డాక్టరు
మళ్లీ ఓడ ఎక్కాడు.




## చివరికి ఇంటికి

ఆ తరవాత నొప్పి డాక్టరు, జంతువులు ఇంటికి
ప్రయాణమయ్యారు.
చాలా రోజుల ప్రయాణం తరవాత తమ ఊరు
పడల్‌బి తీరం కనిపించింది.
జంతువులన్నీ సంతోషంతో నాట్యం చెయ్యసాగాయి,
పైకి, కిందకి దూకసాగాయి.
"ఊళ్లో ఏమేమి మార్పులు జరిగి ఉంటాయో,"
నొప్పి డాక్టరు ఊహించుకోసాగాడు.
"లేదా అలాగే ఉందేమో!"



నొప్పి డాక్టరు ఇంటిలో ఏమాత్రం మార్పు లేదు. అతని ఇంటి నిండా ఉత్తరాలు, చెల్లించాల్సిన బిల్లులు పడి ఉన్నాయి. ఇల్లంతా దుమ్ము, దుమ్ముగా ఉంది.






అప్పుడు నొప్పి డాక్టరు వాళ్ల అక్క వచ్చింది. "హాయ్!" ఆమె సంతోషంతో అరిచింది. అంతలోనే ఆమె తోపుడు-లాగుడిని చూసింది. "నా జీవితంలో ఇప్పటివరకు ఇంత అందమైన జంతువుని చూడలేదు!"

“దాని ఉన్ని చాలా మెత్తగా ఉంటుంది.
చాలా వేగంగా కూడా పెరుగుతుంది,”
నొప్పి డాక్టరు చెప్పాడు.
“ఈ బిల్లులు కూడా వేగంగా చెల్లించ
గలిగితే బాగుండును.”



“వేగంగా పెరిగే ఉన్ని!” అక్క అంది.
ఆమె కళ్లు తళుక్కుమని మెరిశాయి.
“నేను మీ అందరికి ఒక్కొక్క స్వెట్టరు
నేస్తాను. అప్పుడు, ఎవరికీ చలి
వెయ్యదు!”





ఆ తరవాత నొప్పి డాక్టరు అక్క చాలా స్వెట్టర్లు అల్లింది. వాళ్లు వాటిని అమ్మారు.

ఆ విధంగా వాళ్లకి చాలా డబ్బులు వచ్చాయి,

వాటితో చెల్లించాల్సిన బిల్లులు చెల్లించారు.

ఇప్పుడు ఇల్లు శుభ్రంగా ఉంది.

ప్రతి ఒక్క జంతువుకి ఒక స్వెట్టరు ఉంది.

అందరికీ కావలసినంత ఆహారం ఉంది.

ఊళ్లోని జంతువులను అన్నింటిని నొప్పి డాక్టరు ప్రేమించేవాడు.

అప్పటినుంచి అందరూ సంతోషంగా ఉన్నారు!



